క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



కోదండరామస్వామి ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన విగ్రహాలు

ఆత్మకూరు: మండలంలోని చెర్లోయడవల్లి ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన సీతా, లక్ష్మణ, హనుమంత సమేత కోదండరామ స్వామి నూతన విగ్రహాల ప్రతిష్టా మహోత్సవం శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ పూజారి గూడా కల్యాణ్ కుమార్‌శర్మ యాడ్మికంలో తెల్లవారుజాము నుంచి శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాత్రికి అన్నదానం, స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు.

భూకుంభకోణం చేసింది టీడీపీ నేతలే



మాట్లాడుతున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు

వరికుంటపాడు: మండలంలోని విరువూరు పంచాయతీలో 2018–19లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు బోగస్ పట్టాలు సృష్టించి బినామీ పేర్లతో రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కాజేశారని స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. విరువూరులో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నేతలు గురువారం గ్రామంలో జరిగిన ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నేతలను తప్పుపట్టడం తీవ్రంగా ఖండించారు. ఎవరు అవినీతికి పాల్పడ్డారో దమ్ముంటే బహిరంగ చర్చకు సిద్ధం కావాలని టీడీపీ నేతలకు సవాల్ విసిరారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో మండల నేతలు ఎన్నో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ భూ అవినీతి, అక్రమాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నిగ్గుతేలుస్తామన్నారు. ఈ సమావేశంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు ఎం.మురళీకృష్ణారెడ్డి, గోను శ్రీకాంత్, బి.వెంకటరమణ, పి.తిరుపతిరెడ్డి, డి.ప్రభాకర్‌రెడ్డి, ఎం.అనంత రెడ్డి, ఎం.శ్రీనివాసులురెడ్డి, తదితరులున్నారు.

విష్ణు సమక్షంలో 50 కుటుంబాల చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలు కప్పిన విష్ణువర్ధన్‌రెడ్డి

అల్లూరు: మండలంలోని గాలిదిబ్బలుకు చెందిన 50 కుటుంబాలు టీడీపీని వీడి శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి నివాసంలో ఆయన సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. స్థానిక నేత కోటేశ్వరరావు ఆధ్వర్యంలో వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలోకి వస్తున్న వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయసాయిరెడ్డిని, ప్రతాప్‌కుమార్ రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

బొలెరో, ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు చెరువుకట్ట సమీపంలో శుక్రవారం బొలెరో, ఆటో ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై కోటిరెడ్డి సమాచారం మేరకు.. గుంటూరుకు చెందిన బొలెరో వాహనం వింజమూరు వైపు వస్తుండగా, వింజమూరు నుంచి జీబీకే ఆర్ ఎస్సీ కాలనీకి వెళుతున్న ఆటో ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఎస్సీ కాలనీకి చెందిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వరిగడ్డి దగ్ధం

సోమశిల: గడ్డి తరలిస్తున్న లారీకి ఉన్న కర్రలు విద్యుత్ తీగలకు తగలడంతో నిప్పు రవ్వలు చెలరేగి గడ్డి మీద పడడంతో వరి గడ్డి దగ్ధమైంది. ఈ ఘటన అనంతసాగరం మండలం లింగంగుంట ఎస్సీ కాలనీ చర్చ్ దగ్గర శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. దీంతో లారీకి మంటలు అంటుకునే ప్రమాదం ఉండడంతో గడ్డి కట్టలను కిందకు తోసేశారు. దీంతో సుమారు రూ.15 వేల మేర నష్టం వాటిల్లింది.


కావలి కాలకేయుడు



కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి ఫ్రస్ట్రేషన్‌తో కాలకేయుడుగా మారాడు. అక్రమ మార్గాలతో నడమంత్రపు శ్రీమంతుడుగా ఎదిగిన కావ్య తన అరాచకాలకు అడ్డుపడే వారందరిని ధనబలంతో నలిపేశాడు. రాజకీయంగా ఎదిగి కనకపట్నాన్ని కబళించాలని భావిస్తున్నాడు. ఆది నుంచి రాజకీయ విలువలను వదిలేసి, రౌడీయిజాన్ని నమ్ముకుని వివాదాస్పదంగా మారాడు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి పోకడలు నచ్చని సొంత పార్టీ లీడర్లతో పాటు శ్రేణులు సైతం దూరదూరంగా ఉండడంతో ఏకాకిగా మారిన కావ్యకు ఓటమి తథ్యమని తెలియడంతో వికృత చేష్టలకు దిగాడు. ఫేక్ ఐడీలతో సిమ్‌లు తీసుకుని వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి, తన గుమాస్తాలకు మీడియా ముసుగేసి అను నిత్యం వివాదాస్పద ప్రచారాలు, దూషణలు చేస్తూ పబ్బం గడుపుకోవాలనే ప్రయత్నాలను కావలి ప్రజలు ఛీదరించుకుంటున్నారు.

ఫేక్ ఐడీలతో సిమ్‌లు

- ఆ సిమ్‌లతో వాట్సాప్ గ్రూపుల ఏర్పాటు
- తన ముఠా సభ్యులే ఫేక్ మీడియా అవతారం
- వివాదాస్పద ప్రచారాలు, దూషణలు



ఈ నంబర్ ఉదయగిరి నియోజకవర్గంలోని జలదంకి మండలం అన్నవరం క్వారీలో విధులు నిర్వహించిన ఉత్తరభారతదేశానికి చెందిన ఒక కార్మికుడి పేరుతో సిమ్ తీసుకున్నారు. అక్రమంగా నిర్వహిస్తున్న ఆ క్వారీని అధికారులు రూ.వందల కోట్ల జరిమానా విధించి మూసేశారు. ఈ క్వారీ యజమాని అయిన కావ్య కృష్ణారెడ్డి ఆ నంబరు తీసుకుని తన సోషల్ మీడియా టీంలో ఉన్న జలదంకి మండలం చిన్నక్రాక గ్రామానికి చెందిన రేషన్ డీలర్‌కు ఇచ్చాడు. వాట్సాప్‌లో 'స్పైడర్' అనే పేరు పెట్టుకుని కావలి ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, ఆ పార్టీ మద్దతుదారులపై నీచమైన పోస్టులు పెడుతున్నాడు. కావ్య మెప్పు కోసం రేషన్ డీలర్ ఫేక్ ఐడీతో రెచ్చగొట్టే ధోరణిలో కవ్వింపు పోస్టులు పెడుతున్నాడు.



ఉలవపాడు మండలం భీమవరం చిరునామాతో ఉన్న ఈ నంబర్‌ను కావలిలో ఎల్లో మీడియా(టీవీ)కు కావలిలో ఇటీవల నుంచి విలేకరిగా పనిచేస్తున్న వ్యక్తి వాడుతున్నాడు. 'అరుణ్' అనే ఫేక్ పేరుతో వాట్సాప్ నుంచి వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై నికృష్ట పదజాలంతో నిత్యం పోస్టులను పెడుతున్నాడు. కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కోసం ఫేక్ పేరు, ఫేక్ నంబర్‌తో టీవీ విలేకరి చేస్తున్న నీచ ప్రచారం.

కావలి: కావలిలో కావ్య కాలనాగుల విన్యాసం వికారం పుట్టిస్తోంది. టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి ప్రజాదరణే కాదు.. పార్టీ అభిమానుల ఆదరణ కోల్పోయి ఆ ఫ్రస్ట్రేషన్‌తో ప్రత్యర్థిపై, ఆ పార్టీ శ్రేణులపై అనునిత్యం కాలకూట విషం కక్కుతున్నాడు. రాజకీయ విలువలకు పాతరేస్తూ తన క్వారీల్లో పని చేసే గుమాస్తాలకు మీడియా ముసుగేసి వాట్సాప్ గ్రూపుల్లో ఉచ్చం.. నీచం మరిచి ఆరోపణలు, దూషణలు చేయిస్తున్నాడు. గతంలో తన క్వారీల్లో పని చేసి వెళ్లిన వారి ఐడీలతో సిమ్‌లు తీసుకుని ఫేక్ ఐడీలతో కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతున్న పరిస్థితి కొద్ది రోజులుగా మితిమీరడంతో కావలి పోలీసులతో పాటు ఎన్నికల పర్యవేక్షణాధికారులు దృష్టి సారించారు.

సోషల్‌మీడియా వేదికగా దుష్ప్రచారాలు

'ఆవు చేలో మేస్తే.. దూడ గట్టున' మేస్తుందా? అనే సామెత చందాన? టీడీపీ అధినాయకత్వం నుంచి అభ్యర్థుల వరకు అదే తీరుగా ఉంది. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే ఎన్నికల్లో గెలవాలంటే ప్రజలకు మేలు చేసిన చరిత్ర ఉండాలి. ప్రజాదరణ పొందితే గెలుపు సాధ్యమవుతుంది. అయితే క్షేత్రస్థాయిలో టీడీపీకి ప్రజాదరణ లేకపోవడం, ఎన్నికలు సమీపించే కొద్దీ ఆ పార్టీ అధినేతల పోకడలు మరింత పతనానికి దారితీస్తోంది. ఈ ఎన్నికల్లో గెలుపు సాధ్యం కాదని నిర్ధారించుకున్న టీడీపీ శ్రేణులు అధిష్టానం నుంచి అభ్యర్థుల వరకు తమ ప్రత్యర్థి వైఎస్సార్‌సీపీ నేతలపై, ఎమ్మెల్యేపై అనునిత్యం సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారాలను నమ్ముకుంది. ఈ కోవలోనే కావలి అభ్యర్థి మరో అడుగు ముందుకేసి కాలకేయుడు కంటే మిన్నగా వ్యవహరిస్తున్నాడు.

తానేమి చేస్తానో చెప్పలేక..

ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన కావ్య కృష్ణారెడ్డికి టీడీపీలో కనీసం సభ్యత్వం లేకపోయినప్పటికీ నేరుగా ఆ పార్టీ కావలి అభ్యర్థిత్వాన్ని సంపాదించుకోగలిగాడు. కావలి నియోజకవర్గానికి ఎటు వంటి సంబంధం లేని కావ్య కృష్ణారెడ్డి ఎన్నికల్లో పోటీ చేయడం ప్రజాస్వామ్యదేశంలో రాజ్యాంగం కల్పించిన హక్కు. అయితే తాను ఎవరో, కావలితో తనకున్న అనుబంధం ఏమిటో.. తనను గెలిపిస్తే కావలికి ఏం చేయగలనో చెప్పి ఓట్లు అభ్యర్థించడం ధర్మం. అయితే ఇందుకు భిన్నంగా కావ్య తాను పెట్టుకొన్న సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారానికి తెగబడ్డాడు. కావలి నుంచి ప్రజల ఆదరాభిమానాలతో రెండు దఫాలు ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్‌హార్బర్‌ను నిర్మించారు. ఈ రెండు ప్రాజెక్ట్‌ల మధ్య ఇండస్ట్రియల్ హబ్‌తో పాటు దామవరం విమానాశ్రయం తదితర ప్రధానమైన ప్రాజెక్ట్‌లను తెచ్చారు. అభివృద్ధి విజనరీగా గుర్తింపు తెచ్చుకున్న ప్రతాప్‌కుమార్‌రెడ్డికి ప్రజల్లో ఆదరణ మరింతగా పెరిగింది. అటువంటి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిని విలన్‌గా ప్రచారం చేస్తే, తాను హీరో అని నమ్ముతారనే భ్రమతో తన సోషల్ మీడియా టీమ్‌కు ఫేక్ సిమ్‌లు ఇచ్చి, ఫేక్ పేర్లతో విష ప్రచారాలు చేయిస్తున్నాడు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆయన మద్దతుదారులపై జుగుప్సాకరమైన పోస్టులు పెట్టి సంబర పడుతున్నారు.

ఎన్నికల యంత్రాంగం ఆరా

ఎన్నికల కమిషన్ నిబంధనలు మేరకు ఇటువంటి వివాదాస్పదమైన, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, వ్యక్తిగత దూషణలు చేయడం నేరం. ఇటువంటి వారిపై చర్యలు తీసుకుని కేసు నమోదు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కావలిలో టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డికి మద్దతుగా ప్రత్యర్థి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై సోషల్ మీడియా వేదికగా చేస్తున్న వివాదాస్పద, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, వ్యక్తిగత దూషణలపై ఎన్నికల అధికారులు దృష్టి సారించారు. వాట్సాప్ గ్రూపుల్లో వివాదాస్పదమైన ప్రచారం చేస్తున్న నంబర్లు ఎవరి పేరుతో ఉన్నాయి.. ఎవరు వాడుతున్నారు.. ఎక్కడి నుంచి ఆపరేట్ చేస్తున్నారు.. వీరంతా ఎవరి కోసం పని చేస్తున్నారు.. ఇలా అనేక కోణాల్లో వివరాలు సేకరించినట్లు సమాచారం.

రెండో రోజు నామినేషన్లు నిల్

ఉదయగిరి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి రెండో రోజు శుక్రవారం ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదని ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్ల దాఖలు ప్రక్రియకు అభ్యర్థుల కోసం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

రెండో సెట్ నామినేషన్ దాఖలు

ఆత్మకూరు: త్వరలో జరగనున్న ఆత్మకూరు అసెంబ్లీ ఎన్నికలకు నెల్లూరు కృష్ణారెడ్డి అనే వ్యక్తి తొలి నామినేషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం రెండో సెట్ నామినేషన్‌ను ఆత్మకూరులోని ఆర్‌ఓ కార్యాలయంలో ఆర్డీఓ, ఆర్‌ఓ కె మధులతకు అందజేశారు.

కావ్య ఒంటరిగానే నామినేషన్ దాఖలు

కావలి : కావలి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి శుక్రవారం ఒంటరిగానే వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. కనీసం సొంత పార్టీ కార్యకర్తలు, మిత్రపక్షాలైన బీజేపీ, జనసేన నాయకులు కూడా నామినేషన్‌కు హాజరు కాకపోవడం గమనార్హం. నామినేషన్‌కు ముందు కుటుంబ సభ్యులతో గుడికి వెళ్లి పూజలు చేయడం, పెద్దల ఆశీర్వాదం తీసుకోవడం కూడా జరగలేదు. అహంకార ధోరణితో అర్చకులను, పాస్టర్లు, ముస్లిం మత పెద్దలను ఇంటికే పిలిపించుకొని ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం నేరుగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు. కావ్యకు ముందే ఓటమి తప్పదని తెలియడంతో మొక్కుబడిగా నామినేషన్లు వేశారంటూ ఆ పార్టీ నేతలే బాహాటంగా చెప్పుకోవడం వినిపించింది.

25 మద్యం బాటిళ్లు పట్టివేత

ఆత్మకూరు: పట్టణంలోని పేరారెడ్డిపల్లికి చెందిన రాములు అక్రమంగా 25 మద్యం బాటిళ్లను తీసుకెళ్తుండగా అతన్ని అదుపులోకి తీసుకొని, మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె ముత్యాలరావు తెలిపారు. శుక్రవారం ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు.

టీడీపీ మాయల మరాఠి పార్టీ



పార్టీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలతో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- నమ్మితే నట్టేట మునిగినట్లే
- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: టీడీపీ మాయల మరాఠి పార్టీ అని, తమ పబ్బం గడుపుకునేందుకు మాయమాటలు చెబుతారని నమ్మితే నట్టేట మునిగినట్లే అని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన టీడీపీ, జనసేన నుంచి నాయకులు, కార్యకర్తలు 150 మంది శుక్రవారం ఆ పార్టీలకు గుడ్‌బై చెప్పారు. ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు పండగలకు ఏడాదికొకసారి చంద్రన్న కానుకలు అని ఇచ్చి, రాష్ట్రాన్ని అడ్డంగా దోచేశారని ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలోని పేదలకు, అర్హులకు వినూత్న సంక్షేమ పథకాలు అందించి జీవితాలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నారన్నారు. ప్రజలు బాగుపడాలన్నా.. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నా.. కావలి నియోజవకర్గం మరింత అభివృద్ధి చెందాలన్నా వైఎస్సార్‌సీపీని ఆదరించాలని ఎమ్మెల్యే కోరారు.

నామినేషన్ రోజే గెలుపెవరిదో తేలింది

పార్టీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గెలవడం ఖాయమని తెలిసిపోయిందన్నారు. నామినేషన్ రోజే స్పష్టమైందన్నారు. టీడీపీ, జనసే పార్టీల నాయకులు, కార్యకర్తలు అంటే ప్రజలు ఛీత్కరిస్తున్నారని, ఆత్మాభిమానం ఉన్న వారెవరూ ఆ పార్టీల్లో ఉండరన్నారు. వైఎస్సార్‌సీపీలో చేరడంతో తమకు గౌరవం రెట్టింపు అయిందన్నారు. సౌమ్యులు, అందరినీ ఆత్మీయంగా చూసే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కావలి ఎమ్మెల్యేగా, నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయి రెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఈతముక్కల చంద్రశేఖర్‌రెడ్డి (చందు) తదితరులు పాల్గొన్నారు.

నెరవేర్చే హామీలే సీఎం జగన్ ఇస్తారు

- లోకేష్ అర్థరహిత విమర్శలు మానుకోవాలి
- మాజీ ఎంపీ రాజమోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి

మర్రిపాడు: 2019 ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్ర పేరుతో రాష్ట్రమంతటా పర్యటించారని, ఆయన అప్పట్లో కూడా తాను నెరవేర్చగలిగే హామీలను మాత్రమే ప్రజలకు ఇచ్చారని, ప్రతి హామీని అమలు చేసి ధైర్యంగా ఓటు అడిగేందుకు ప్రజల్లోకి వస్తున్నారని మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని శెట్టిసముద్రంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలతో మాట్లాడారు. ప్రజలను మోసం చేయడానికి టీడీపీ అభ్యర్థులు ప్రజల్లోకి వస్తున్నారని, వారిని, వారి హామీలను నమ్మవద్దన్నారు. 2014లో 600కు పైగా హామీలను ఇచ్చిన చంద్రబాబు ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. జగన్ ఇచ్చిన హామీలను కరోనాలో సైతం అమలు చేసిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఐదేళ్ల పాటు సంక్షేమ పాలన అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం పేరుతో బస్సుయాత్ర నిర్వహిస్తూ ప్రజలను కలుసుకుంటూ వస్తున్నారని, ఆయనపై ప్రతిపక్ష పార్టీ నాయకుల ప్రోద్బలంతోనే రాయి దాడి జరిగిందన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రంలో పలు రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు, మంత్రులు జగన్ త్వరగా కోలుకోవాలంటూ ట్వీట్ చేస్తే, మన రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీల నాయకులు మాత్రం అర్థరహిత విమర్శలు చేస్తూ రాక్షసానందం పొందారన్నారు. లోకేష్ విమర్శలు చూస్తే అతనేంటో ప్రజలకు పూర్తిగా అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, దుగ్గిరెడ్డి కృష్ణప్రసాద్‌రెడ్డి, ముటుకుందు లక్ష్మీరెడ్డి దొరసాల సుబ్బారెడ్డి, గోపిరెడ్డి దశరథరామిరెడ్డి, దొరసాల రాములు, దొరసాల వెంకటేశ్వర్లు, దొరసాల నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటరమణ

వింజమూరు (ఉదయగిరి): వింజమూరులో కొలువైన చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కావలి డీఎస్పీ వెంకటరమణ దేవాలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రశాంతమైన వాతావరణంలో భక్తిభావంతో వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ఈ బ్రహ్మోత్సవాల బందోబస్తుకు ఇద్దరు సీఐలు, పది మంది ఎస్సైలు, వంద మంది సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు గణపం సుదర్శన్‌రెడ్డి, గణపం రమణారెడ్డి, ఆలయ ఈఓ మల్లికార్జున్‌రెడ్డితో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు.

కోదండరాముడికి ఏకాంత సేవ



ఆత్మకూరు పంటవీధి రామాలయంలో ఏకాంత సేవ మహోత్సవం

ఆత్మకూరు: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని సుందరమ్మ కోదండ రామాలయం, పంటవీధి రామాలయాల్లో స్వామి వారి ఏకాంత సేవ నేత్రపర్వంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఏకాంత సేవ మహోత్సవ విశిష్టతను అర్చకులు వివరించారు. నవరాగాల, మేళతాళ సంగీతంతో ఏకాంత సేవను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

వైభవంగా సీతారాముల గ్రామోత్సవం



స్వామి వార్లను పల్లకిలో గ్రామోత్సవం చేస్తున్న భక్తులు

వరికుంటపాడు: వరికుంటపాడులో శ్రీరామనవమి పర్వదిన వేడుకల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం ఉదయం గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకిలో కొలువుదీర్చి గ్రామోత్సవం చేపట్టారు. మహిళలు నైవేద్యాలు సమర్పించారు.

రామాలయానికి ఛత్రాల వితరణ



ఛత్రాలను సమర్పిస్తున్న గ్రామస్తులు

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని శంఖవరం రామాలయానికి స్థానికులు భూమిరెడ్డి భక్తవత్సలరెడ్డి–శీనమ్మ, శ్రీనివాసులురెడ్డి–బుజ్జమ్మ దంపతులు ఛత్రాలను బహూకరించారు. ప్రస్తుతం గ్రామంలో సీతారాముల ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భాజాభజంత్రీలు, మంగళవాయిద్యాలతో ఛత్రాలను ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

చేసిన సేవలే గుర్తుంటాయి

ఆత్మకూరు: వృత్తిపరంగా ఉద్యోగులు చేసే సేవలే చిరకాలం గుర్తుంటాయని ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదని పలువురు వక్తలు అన్నారు. ఆత్మకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (వెస్ట్)లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు డి రమణయ్య, పి జయమ్మ త్వరలో ఉద్యోగ విరమణ కానుండడంతో వేసవి సెలవుల దృష్ట్యా వారిద్దరిని పాఠశాలలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు రమణయ్య దంపతులు, జయమ్మ దంపతులను శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి నారాయణ రావు, ఈశ్వర్‌రెడ్డి, లక్కు ప్రసాద్, జిలానీ బాషా, జాకబ్, తదితరులు పాల్గొన్నారు.

స్వలాభంతో వచ్చారు.. వెన్నుపోటు పొడిచారు

- పార్టీ మారిన వాలిపై వైఎస్సార్‌సీపీ నేతల ధ్వజం



ఆత్మకూరు ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరలతో మాట్లాడుతున్న పార్టీ నాయకులు

ఆత్మకూరు: ఎలాంటి గుర్తింపు లేకపోయినా.. దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి వారికి ఉజ్వల భవిష్యత్ ఉండేలా రాజకీయ పదవులకు ఎంపిక చేస్తే లబ్ధిపొంది చివరకు పార్టీకి వెన్నుపోటు పొడిచారని, ఇటువంటి వారిని ప్రజలు క్షమించరని, తగిన బుద్ధి చెబుతారని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పార్టీ పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ ఆదిశేషయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ఇటీవల చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, ఇద్దరు కౌన్సిలర్లతో పాటు ఎంపీపీని ప్రలోభాలకు గురి చేసి టీడీపీలోకి చేర్చుకున్నారని, వారి తీరును ఖండిస్తూ ధ్వజమెత్తారు. అనామకులుగా ఉన్న వారిని గత స్థానిక సంస్థల ఎన్నికల్లో కౌన్సిలర్లుగా, ఎంపీటీసీగా గెలిపించి చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ పదవులు ఇవ్వడం, ఎంపీటీసీ ఎంపీపీగా చేశారని, వారు తమ అవసరాలు తీరాక అనేకంగా లబ్ధిపొంది పార్టీకి వెన్నుపోటు పొడిచి టీడీపీకి అమ్ముడుపోయారన్నారు. పదవుల్లో పశువుల్లా అమ్ముడుపోయినంత మాత్రం తమ పార్టీకి వచ్చిన నష్టం లేదన్నారు. ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పక్షం ఉన్నారని, ఈ విషయం రేపు ఎన్నికల తర్వాత తెలుస్తుందన్నారు. వలంటీరుగా అవకాశం ఇచ్చి, కౌన్సిలర్‌గా గెలిపించి పట్టణ ప్రథమ పౌరురాలిగా చైర్‌పర్సన్ పదవిని అప్పగిస్తే ఆమె తన రాజకీయ భవిష్యత్‌ను సమాధి చేసుకుందన్నారు. ఈ సమావేశంలో గంధళ్ల లక్ష్మీ, కొండా వెంకటేశ్వర్లు, ముజీబ్, అబ్దుల్ సమద్, రిజ్వాన్, కె కిషోర్, జమీర్, నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, వినయ్‌కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

సీతారామపురం: నెల్లూరు, కడప, ప్రకాశం జిల్లాల సరిహద్దు ప్రాంతం సీతారామపురం నుంచి కందుకూరు మీదుగా ఒంగోలు వెళ్లేందుకు కందుకూరు డిపో బస్సులను పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు. గతంలో ఎంతో అనువుగా ఉండే కందుకూరు డిపోకు చెందిన రెండు బస్సు సర్వీసులు సీతారామపురం వరకు నడిచేవని, కాలక్రమేణా వాటిని ఆర్టీసీ అధికారులు రద్దు చేశారని ఈ ప్రాంత వాసులు వాపోతున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం దృష్ట్యా ఆర్టీసీ యాజమాన్యం తిరిగి ఆ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

చౌకదుకాణ డీలరుపై కేసు నమోదు

వరికుంటపాడు: మండలంలోని గణేశ్వరపురంలో చౌకదుకాణ డీలరు పేరం భాగ్యలక్ష్మిపై మండల ఎన్నికల నోడల్ అధికారి జి.వేణుగోపాలరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతయ్య తెలిపారు. మంగళవారం గణేశ్వరపురంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగ్యలక్ష్మి పాల్గొన్న విషయం 'సాక్షి'లో వార్త ప్రచురితమైంది. ఈ మేరకు నోడల్ అధికారి విచారణ చేపట్టి పోలీసులకు ఆమెపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

21న ఆరో తరగతి ప్రవేశ పరీక్ష

దుత్తలూరు: స్థానిక ఏపీ మోడల్ పాఠశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 21న మోడల్ పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ జె.సైమన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 148 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్నారని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. లేకుంటే మోడల్ పాఠశాలలో ఇస్తారన్నారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, విద్యార్థులు ఉదయం 9 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.

కారు ఢీకొని 9 గొర్రెల మృతి

మర్రిపాడు: ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి గొర్రెల మందపైకి కారు దూసుకెళ్లడంతో 9 గొర్రెలు మృతి చెందాయి. ఈ ఘటన మర్రిపాడు సమీపంలో అల్లంపాడు క్రాస్ రోడ్డు వద్ద నెల్లూరు – ముంబయి జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. పల్లవోలుకు చెందిన చిన మాలకొండయ్య వింజమూరుకు గొర్రెలు తోలుకెళ్తుండగా ఈ ఘటన జరిగింది. కారు కదిరి నుంచి నెల్లూరుకు వెళ్తోంది. కారు ఆగకుండా వెళ్లిపోవడంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు డీసీపల్లి టోల్‌ప్లాజా పట్టుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

